
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





పంటల బీమాపై మీనమేషాలు

అమలు చేయడంలో సర్కారు ఉదాసీనత

రూ.470 కోట్ల నష్టం

హనుమకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉచిత పంటల బీమా పథకం అమలు లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాలు తుడిచిపెట్టుకుపోతుండడంతో ఆదుకునేవారు లేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏటా అకాలవర్షాలు, వడ గళ్లవానలతో కోట్లాది రూపాయల పంట నేలపాలవుతున్నది. గతంలో పంటల బీమా పథకం అమలులో ఉన్నప్పుడు ఆలస్యంగా అయినా నష్టపరిహారం అంది కొంతమేరకైనా ఉపశమనం లభించేది. ఇప్పుడు అదికూడా లేదు. నాలుగేళ్లుగా పంటల బీమా పథకం అమలు కావడం లేదు. ఏప్రిల్ 1 నుంచి వానాకాలం పంట రుణం తీసుకునే సమయం మొదలు కావటం, వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్నతో పాటు ఆయిల్‌పామ్‌తో పాటు వాణిజ్య పంటలను విత్తుకునే అదను దగ్గర పడుతున్నందువల్ల ఇప్పటి నుంచే పంటల బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. కానీ ఆ ఛాయలేవి కనిపించడం లేదు.

మీనమేషాలు

పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించడంలో రాష్ట్రప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతోంది. 2024 వానాకాలం సీజన్ నుంచే పంటల బీమాను పునరుద్ధరించనున్నట్లు చెప్పిన ప్రభుత్వం.. 2024 వానాకాలం, 2024-25 యాసంగి పంటకాలాల్లోనూ పంటల బీమాను అమలు చేయలేదు. ఇప్పుడు తాజాగా 2025 వానాకాలం నుంచి అమలు చేస్తామని చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకంపై ఒక నిర్ణయానికి రాలేకపోతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు పంటల బీమాపై విధివిధానాలను ఖరారు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఈ సీజన్‌లో పథకం అమలు లేనట్లేనని తెలుస్తోంది.

అటకెక్కిన హామీ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే ఏడాదిగా ఈ పథకం అమలుకు విధివిధానాలు రూపొందించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఫసల్ బీమా యోజనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకుంటున్న పంటల బీమా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కొంత మేర కసరత్తు చేసినా ఆ తర్వాత ఎందుకో ప్రభుత్వం దీనిని పక్కన పెట్టింది. వాస్తవానికి గత వానాకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. టెండర్లను ఏక మొత్తంగా కాకుండా క్లస్టర్లవారీగా పిలవాలని వ్యవసాయ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. అయితే టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే నిధులపై స్పష్టత వస్తుంది. రాష్ట్రం వాటా చెల్లించిన తర్వాతే కేంద్రం వాటా జమ చేస్తుంది. ఉచిత పంటల బీమా పథకం అమలు కోసం బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణ కోసం రాష్ట్రస్థాయిలో అధికారులు చర్చలతోనే సరిపెట్టారు.

- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న అన్నదాత
- అకాల వర్షాలతో ధ్వంసమైన పంటలు
- నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో రూ.470 కోట్ల నష్టం
- అందని ద్రాక్షలా ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం

ఫసల్ బీమా యోజన

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని 2018-19 సీజన్ వరకు అమలు చేసి నిలిపివేసింది. ఇది వరకు వివిధ పంటలకు బీమా ఉండేది. ఆయా పంటలకు నోటిఫికేషన్ వెలువరించి రైతుల నుంచి ప్రీమియం తీసుకునేవారు. వరికి గ్రామం యూనిట్‌గా, మక్క, కంది, పెసర, మినుము, సోయా, పసుపు, వేరుసెనగ, నువ్వు పంటలకు మండలం యూనిట్‌గా బీమా వర్తింప చేశారు. వాతావరణ ఆధారిత బీమా పరిధిలో వానా కాలం మిరప, పత్తి, యాసంగిలో మామిడి పంటలుండేవి. బ్యాంకుల నుంచి రైతులు పంట రుణం తీసుకునే సమయం లోనే వానాకాలం సీజన్‌కు 2 నుంచి 5 శాతం, యాసంగిలో 1.5 శాతం నుంచి 5 శాతం ప్రీమియం బ్యాంకర్లు తప్పనిసరిగా మినహాయించి బీమా కంపెనీకి చెల్లించేవారు. రైతులు చెల్లించిన కిస్తీ మొత్తంతో సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన సగం ప్రీమియం రైతు రాయితీగా కంపెనికి చెల్లించేవి. కానీ కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేయడం, రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు వెలువరించక పోవడంతో పంటల బీమా పథకం కొన్నేళ్లుగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కిస్తీ చెల్లించి బీమాను వెంటనే అమలులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో సుమారు రూ.470 కోట్ల మేరకు పంట నష్టం జరిగింది. ఇందులో ఎక్కువగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలే ఎక్కువగా దెబ్బతిన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా రూ.120కోట్లు, జనగామ జిల్లాలో రూ.100కోట్లు, హనుమకొండ జిల్లాలో రూ.50కోట్లు, వరంగల్ జిల్లాలో రూ.75కోట్లు, ములుగు జిల్లాలో రూ.60కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.65కోట్ల మేరకు పంట నష్టం జరిగినట్టు అంచనా.

రూ.10వేల పరిహారం ఏదీ?

అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ అది కూడా అమలుకు నోచుకోవడం లేదు.

పంటల బీమాకు సంబంధించి కేంద్ర పథకం ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో ఇంకా అమల్లోకి రానందువల్ల రాష్ట్ర బడ్జెట్ నుంచే నష్టపరిహారం ఇవ్వాలని సర్కారు నిర్ణయించినా ఆచరణకు నోచుకోలేదు. ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 4వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతుల వారీగా నివేదిక ప్రభుత్వానికి అందింది. అయితే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలకు రావడానికి రైతుల వారీగా సర్వే చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు అందినట్టు సమాచారం. అయితే నివేదికలు అందినా ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం అందుతుందా? అన్నది సందేహమే.

19.23 లక్షల ఎకరాల్లో సాగు

వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే క్రాప్ బుకింగ్ యాప్‌లో పంటల వివరాలు నమోదైతే నష్టం

మిగతా 7వ పేజీలో...



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

5 నుంచి రెవెన్యూ సదస్సులు

- ఈ నెల చివరి నాటికి దరఖాస్తులను పరిష్కరించాలి
- నీట్ పరీక్ష నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మే 5 నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టు జిల్లాల్లో మినహాయించి, మిగిలిన వాటిలో జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని.. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూన్ 2వరకు పైలెట్ ప్రాజెక్టు మండలాల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4మండలాల్లో 12,759దరఖాస్తులు వచ్చాయని, భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సదస్సుల్లో సుమారు 15లక్షల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భూభారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులను కూడా పరిశీలించాలని చెప్పారు. భూసేకరణ కింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులను అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలను రద్దు చేయాలన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బయో మెట్రిక్ అటెండెన్స్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మచారి, ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్, అధికారులు పురుషోత్తం, నర్సింహామూర్తి, రాజయ్య, ముఖేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు దగా.! 8

12 నుంచి రిజిస్ట్రేషన్ కార్యాయాల్లో స్లాట్ బుకింగ్

హనుమకొండ టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ నెల 12నుంచి స్లాట్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, నర్సంపేట, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత ఏప్రిల్ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టి 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్లాట్ బుకింగ్ విధానంతో 94శాతం మంది ప్రజలు సంతృప్తి చెందడంతో పాటు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం తగ్గడంతో ఈ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి 15నుంచి 20 నిమిషాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానున్నట్లు తెలిపారు. సయమం ఆదాతోపాటు రోజుకు 40 నుంచి 50 స్లాట్‌బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్లాట్ బుకింగ్‌తో సమ యం ఆదా అవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఎల్లుండి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'


మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ మండలాల్లో ఈనెల 5వ తేదీ నుంచి జూన్ 13 వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం కొనసాగుతుందని మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 18 సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 'తక్కువ యూరియా వాడండి-సాగు ఖర్చును తగ్గించండి' అవసరం మేరకు రసాయినాలు వినియోగించాలని నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని, రసీదులను భద్రపరిచి కష్టకాలంలో నష్టపరిహారం పొందాలనే అవగాహన అంశాలను రైతులకు కల్పిస్తామని ఆమె వివరించారు.

డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి

జిల్లా ఉద్యానవన అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యానవన కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్, పండ్లతోటలు, కూరగాయలు, మల్బరి సాగు వంటికి మార్కెట్‌లో డిమాండ్ ఉందని, ఈ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారులు, ఆయిల్‌ఫెడ్, బిందుసేద్యం అధికారులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం



మహబూబాబాద్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని కొత్తబజారులో శనివారం నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నంద నాగార్డెన్స్ వద్ద మిషన్ భగీరథ సంప్ నుంచి కొత్తబజారుకు నీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ రైల్వే క్రాసింగ్ వద్ద లీకేజీ ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. పైపులైన్ రిపేర్ చేసేందుకు గాను నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంద ని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



సీరోలు మండలం కాంపెల్లిలో ఇంటిపైకప్పు లేచిపోవడంతో లోపల ఉన్న చిన్నారులు బిక్కుబిక్కుమంటున్న దృశ్యం

గాలిదుమారం బీభత్సం

- అకాల వర్షానికి రోడ్లపై కూలిన వృక్షాలు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- లేచిపోయిన ఇళ్ల పైకప్పులు, రాలిన మామిడికాయలు
- కొన్ని ప్రాంతాల్లో నేలవాలిన వరి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఇబ్బందులు పడిన జనం, రైతులు



డోర్నకల్ మండలం గొల్లచర్లలో తడిసిన ధాన్యంను ఆరబెట్టుకుంటున్న రైతులు



మహబూబాబాద్ మండలంలో అకాల వర్షానికి తడిసిన ఇటుక బట్టిలను చూపుతున్న కరుణాకర్‌రెడ్డి



కంబాలపల్లిలో రోడ్డుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

మహబూబాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం రాత్రి అకస్మాత్తుగా వీచిన బలమైన గాలి, దుమారం అతలాకుతలం చేసింది. పలు మండలాల్లోని రోడ్లపై భారీ వృక్షాలు నేలకొరగగా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు, స్థానికులు వెళ్లి యంత్రాలతో చెట్లను కట్ చేశారు. జేసీబీలతో రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మామిడితోటల్లోని చివరి కాత మామిడి కాయలూ చేతికి అందకుండా రాలిపోయాయి. కొన్ని చోట్ల ఇళ్ల పైకప్పులు లేచిపోయి, వస్తువులు తడిసి పలువురు నష్టపోయారు.

150 ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి..

మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురియగా, ఆ నీటిప్రవాహానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. బయ్యారంలో వందేళ్ల చరిత్ర ఉన్న రావిచెట్లు కూడా కూకటివేళ్లతో సహ నేలకొరిగాయి. డోర్నకల్, కురవి, మహబూబాబాద్ మండలాల్లో 69 మంది రైతులకు చెందిన 150ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని ఉద్యానశాఖ అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు జిల్లాలో 217 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి ఓ వైపు గాలి వాన బీభత్సం సృష్టించి, వర్షం పడగా శుక్రవారం పగలు 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతతో ఎండలు దంచికొట్టడంతో ప్రజలు ఎండకు పరేషాన్‌కు గురయ్యారు.

జిల్లాలో ఇలా..

బయ్యారం మండలం రంగాపురంలో ముత్యాలమ్మగుడి వద్ద ఉన్న రావిచెట్టుకు వందేళ్ల చరిత్ర ఉంది. రాత్రి వీచిన బలమైన గాలులతో ఆ భారీ వృక్షం కూకటివేళ్లతో సహ నేలకూలింది. ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వందేళ్ల చరిత్ర గల మరో రావిచెట్టు ఉంది. ఆ చెట్టుకు ఉన్న కొమ్మలు దాదాపు 60 శాతం వరకు గాలికి విరిగిపోయాయి. ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారి మార్గంలో కిలోమీటర్ల కొద్ది అనేక చెట్లు రోడ్లపై పడడంతో తెల్లవారు జామున పోలీసులు, స్థానికులు వెళ్లి జేసీబీ యంత్రాలతో వాటిని తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. 50 విద్యుత్ స్తంభాల వరకు విరిగిపోయాయి. తీగలు తెగిపోయి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ లైన్‌లను మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అనేక మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కట్టుగూడెంలోని ఓ కోళ్లఫారం షెడ్డు పూర్తిగా లేచిపోయింది. అనేక కొనుగోలు కేంద్రాల్లోని అడుగు భాగంలో నీళ్లతో ధాన్యం తడిసిపోయాయి.



గూడూరు కొనుగోలు కేంద్రంలో వరదనీటికి కొట్టుకుపోతున్న ధాన్యం

జిల్లాలో 217 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు 217 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డోర్నకల్‌లో 46.2 మిల్లీమీటర్లు, మహబూబాబాద్‌లో 36.4, బయ్యారంలో 32.6, గూడూరులో 32.4, కొత్తగూడలో 30.8, గార్లలో 14.8, కురవిలో 8.4, కేసముద్రంలో 4.8, మరిపెడలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 13.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ తెలిపారు.

తడిసిన మిర్చి

కురవి మండలంలోని బలపాల, నారాయణపురం, గుండ్రాతిమడుగు గ్రామాల పరిధిలోని మామిడితోటల్లో చివరికాయలు సైతం నేలపైపడడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. కురవి, తిర్లాపురం, నల్లెల్ల గ్రామాల్లో ఎండబెట్టుకున్న మిర్చి తడిసిపోయింది. బలపాల, రాజోలు, కురవి మండలాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. కురవి-ఖమ్మం రహదారిపై అనేక చెట్లు విరిగి రోడ్లపై పడడంతో ట్రాఫిక్‌కు

మిగతా 8వ పేజీలో...

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్



నాంచారిమడూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

తొర్రూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తొర్రూరు విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్, సేఫ్టీ ఆఫీసర్ పెద్దిరాజం అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో మే 1 నుంచి 7వ తేదీ వరకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రత వారోత్సవాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలివాన బీభత్సాలతో వైర్లు తెగిపడుతూ ప్రమాదాల బారిన పడుతుంటారని తెలిపారు. ఇళ్ల వద్ద బట్టలు ఆరేసేముందు, ఇంట్లో తెగిన వైర్లు ఇనుప వస్తువులకు తగిలి షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే మరమ్మతులు చేయించుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ పొలాల వద్దకు పశువులను పంపి తెగిన వైర్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. గత సంవత్సరం విద్యుత్ ప్రమాదాలతో 16 మంది మనుషులు, 30 జంతువులు చనిపోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ చలపతిరావు, చిన్నవంగర, తొర్రూరు ఏఈలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడలో జీరో దందా

• లైసెన్స్‌లు లేకుండానే అక్రమంగా ధాన్యం కొనుగోళ్లు
• పన్నుల ఎగవేతతో ప్రభుత్వానికి భారీగా ఆర్థిక నష్టం
• రూ.కోట్లలో క్రయవిక్రయాలు.. ప్రభుత్వానికి రూ.లక్షల్లో నష్టం
• మండల కేంద్రంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న దుకాణాలు
• చోద్యం చూస్తున్న అధికారులు



కొత్తగూడలో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

కొత్తగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో కొందరు వ్యాపారులు యథేచ్ఛగా జీరో దందా కొనసాగిస్తున్నారు. లైసెన్స్‌లు లేకుండానే అక్రమంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. కొత్తగూడ మండలంలో రూ.కోట్లలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతుండగా, ప్రభుత్వానికి ఆదాయం రూ.లక్షల్లో మాత్రమే వస్తోంది. కాంటాల్లో తేడాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తక్కువ ధర చెల్లిస్తూ దోచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వానికి, రైతులకు నష్టం..

లైసెన్స్ లేకుండా చేస్తున్న అక్రమ వ్యాపారంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీగా నష్టం జరుగుతోంది. వ్యాపారుల దోపిడీకి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. లైసెన్స్ ఉన్న వ్యాపారులు ధాన్యం, మొక్కజొన్న, ఇతర పంటలు కొనుగోలు చేస్తే ప్రతీ లావాదేవీలో ప్రభుత్వానికి 1 నుంచి 2 శాతం పన్ను చెల్లించాలి. వారి నుంచి ప్రభుత్వం సేల్స్ ట్యాక్స్, జీఎస్టీ వసూలు చేస్తుంది. కానీ, లైసెన్స్ లేకుండా అక్రమ వ్యాపారులు కొనుగోలు చేసే జీరో దందాలో లావాదేవీలు గుర్తించబడక పోవడంతో ప్రభుత్వం పన్నుల రూపంలో తీవ్రంగా నష్టపోతుంది. మార్కెట్లు లైసెన్స్ ఫీజుల ద్వారా ఆదాయం సంపాదిస్తాయి. ఈ ఆదాయంతో మార్కెట్‌లను అభివృద్ధి చేస్తారు. అయితే వ్యాపారులు లైసెన్స్ తీసుకోకుండా అక్రమ వ్యాపారంతో ఆదాయం తగ్గి మార్కెట్‌లు నష్టపోతున్నాయి. ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర(మినిమమ్ సపోర్ట్‌ప్రైస్) చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తుంది. బోనస్ కుడా చెల్లించ డంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. కానీ, అనుమతులు లేకుండా కొనుగోలుచేయడంతో రైతులు తక్కువ ధరకు విక్రయించుకుని నష్టపోతున్నారు.

కాంటాల్లో తేడాలు, దళారులకు కమీషన్లు..

ఆర్థిక అవసరాలకోసం ధాన్యం విక్రయించుకునేందుకు వచ్చిన రైతులను అక్రమ వ్యాపారులు, దళారులు నిలువునా దోచుకుంటున్నారు. ధాన్యం కొలిచే కాంటాల్లో భారీగా తేడాలు ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వ్యాపారులు దళారులను నియమించుకుని కమీషన్లు ఇస్తున్నారని తెలిసింది. కొత్తగూడ, గంగారం మండలాల్లోని రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు నర్సంపేట, కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్‌ఏనమాముల మార్కెట్‌కు వెళుతుంటారు. దళారులు గుర్తించి వారికి ధరల విషయంలో ఎక్కువ రేటు ఇప్పిస్తామని వ్యాపారుల వద్దకు తీసుకెళతారు. వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. ఈ దోపిడీ చేసిన దాంట్లో దళారులకు కమీషన్లు చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

జీరో దందా వ్యాపారం బాహాటంగా సాగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండటంతో పుట్టగొడుగుల్లా అక్రమ కొనుగోలు దుకాణాలు వెలుస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగూడలో రూ.కోట్లలో కొనుగోళ్లు జరుగుతుండగా ప్రభుత్వంకు చెల్లించాల్సిన పన్నులు రూ.లక్షల్లో నష్టపోతుంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొత్తగూడ మండలంలో జరుగుతున్న జీరో దందా చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జీరో దందాను నియంత్రించాలని కోరుతున్నారు.



వెల్తుర్లపల్లిలో పర్యటిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనివ్వం

» ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వెంకటాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలకు వర్షాకాలంలో సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనివ్వమని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వెల్తుర్లపల్లి గ్రామంలో పర్యటించారు. గత రెండు రోజులుగా భారీ ఈదురుగాలులతో, వర్షాల వల్ల ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో 33.3 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో నష్టం జరిగిందన్నారు. రైతులతో, వినియోగదారులతో మాట్లాడారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రి విద్యుత్ సిబ్బంది శ్రమిస్తూ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి విద్యుత్ సరఫరా అందించారన్నారు. భూపాలపల్లి సర్కిల్ పరిధితో పాటు ములుగు వెంకటాపూర్ మండలంలో సుమారు 351 స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. సుమారు రూ.55లక్షల నష్టం వాటిల్లిందన్నారు. వర్షాలు పడితే ముందుగా నష్టపోయేది విద్యుత్‌శాఖనేనన్నారు. సరఫరా మెటీరియల్ అందుబాటులో ఉంచుకున్నామని, ఎక్కడా ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఎక్కడ అంతరాయం ఏర్పడినా హుటాహుటిన సిబ్బంది చేరుకొని విద్యుత్ సరఫరా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ మల్సూర్‌నాయక్, జీఎం సురేందర్, ములుగు డీఈ నాగేశ్వరావు, భూపాలపల్లి డీఈ పాపిరెడ్డి, ఎంఆర్ఐ కన్‌స్ట్రక్షన్ డీఈ సదానందం, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

• పాపయ్యపల్లి-సింగరకుంటపల్లి రైతుల ధర్నా
• పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



పాపయ్యపల్లి-సింగరకుంటపల్లి గ్రామాల క్రాస్‌వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వెంకటాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలో గల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కాంటాలు పూర్తయిన ధాన్యం తరలించడానికి లారీలు లేవని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండలంలోని పాపయ్యపల్లి-సింగరకుంటపల్లి గ్రామాల క్రాస్‌రోడ్డు వద్ద ఇరుగ్రామాల రైతులు భైఠాయించి సుమారు అరగంట పాటు ధర్నాకు దిగారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సంఘటనా స్థలానికి వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ చేరుకుని వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిచిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. రైతులకు 24 గంటల్లో కొత్త గన్నీ బ్యాగులు, సరిపడా లారీలు పంపాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీఇచ్చి ధాన్యం కొనుగోలు టార్గెట్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులు గురిచేయడం తగదన్నారు. కోసిన ధాన్యం ఆరుదలకు రావడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు ఉన్నప్పటికీ అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిందని తడిసిన ధాన్యం కొనమని సహకార సంఘాలు చెప్పడంతో ఏమి చేయాలో తెలియక రోడ్డెక్కామన్నారు. తమ ఆవేదనను దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

కంబాలపల్లి చెరువులో పడి వ్యక్తి మృతి

• నాడు తల్లి, నేడు తండ్రి దుర్మరణం
• అనాథలైన ముగ్గురు గిరిజన బాలికలు
• భవానీనగర్ తండాలో విషాదఛాయలు
• ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



భాస్కర్ (ఫైల్), అనాథలైన కుమార్తెలు

మహబూబాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి పెద్ద చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన ప్రకారం... జిల్లా కేంద్రం శివారు భవానీనగర్ తండాకు చెందిన జాటోతు భాస్కర్(35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఆరుగురు స్నేహితులతో కలిసి సరదగా గడిపేందుకు కంబాలపల్లి పెద్ద చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు గట్టు నుంచి చివరి వరకు ఈదుకుంటూ వెళ్తానని స్నేహితులకు చెప్పి చెరువులోకి దూకిన భాస్కర్ చెరువు మధ్యలోకి వెళ్లగానే ఊపిరి ఆడక మృతి చెందాడు.

ఈ విషయాన్ని తోటి స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం చెరువు గట్టుకు కుటుంబసభ్యులు వెళ్లి చూడగా గట్టు అంచున భాస్కర్ మృతదేహం కన్పించింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

అనాథలైన ముగ్గురు పిల్లలు

మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు భవానీనగర్ తండాకు చెందిన జాటోతు భాస్కర్-కల్పన దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. భాస్కర్ కూలీ పనులు చేస్తుండగా, కల్పన ఇండ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో గత సంవత్సరం కల్పనపై అనుమానంతో భర్త జాటోతు భాస్కర్ అడ్వకేట్ కాలనీలో మెడకోసి హత్య చేశాడు. అనంతరం ఆ ముగ్గురు గిరిజన బాలికలు తాతయ్య-అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. భాస్కర్ కుమార్తెలైన స్వరూప పదో తరగతి పూర్తి చేయగా, విచిత్ర 7వ తరగతి, వర్షిత 5వ తరగతి విద్యను పూర్తిచేశారు. నాడు.. తల్లి కల్పన తండ్రి చేతిలో హత్యకు గురై మృతి చెందగా, నేడు తండ్రి భాస్కర్ చెరువులో పడి మృతి చెందడంతో ఆ ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు. ప్రభుత్వం ఆముగ్గురు గిరిజన బాలికలను ఆదుకోవాలని తండావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మృతుడు భాస్కర్ సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

• ఇంటర్మీడియట్ అబ్జర్వర్ యాదగిరి

తొర్రూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2, 3 సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ విద్య రాష్ట్ర పరిశీలకుడు టి.యాదగిరి అన్నారు. శుక్రవారం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యార్థి మదార్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధచూపి తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఇటీవల ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, ఉప్పలయ్య, అనిత, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న యాదగిరి

రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్‌కు సన్మానం

మంగపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామానికి చెందిన వసంత శ్రీనివాస్ యాదవ్ మంగపేట మండలానికి మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి కుంజా సూర్య, మంగపేట మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుట్ల నరేందర్‌లు డైరెక్టర్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. జిల్లా, బ్లాక్, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఊతకర్రలా కాంగ్రెస్ ప్రభుత్వం

» ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సీతక్క



ట్రైసైకిళ్ల పంపిణీలో మంత్రి సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో

ములుగు, మే 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల చేతికి ఊతకర్రలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్‌లో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దివ్యాంగులు ఉద్యోగాల కోసం తిరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అందులో వివరాలను నమోదు చేసుకుంటే అర్హతకు తగిన ఉద్యోగం లభించేలా ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం, వారి సాధికారతే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకంలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం అందించే అన్ని ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చిత్రామిశ్రా మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపకరణలు అందించడంలో మంత్రి సీతక్క చొరవ చూపడం ఎంతో గొప్ప విషయమన్నారు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను వినియోగించుకుని వైకల్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తొర్రూరులో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై కక్షకట్టి వారి హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో 40 సంవత్సరాల అపార అనుభవం కలిగిన సుప్రీం కోర్టు లాయర్ సంజయ్ సింఘ్వీ అకాలమరణం కార్మిక లోకానికి తీరని లోటన్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వేగవంతమైన నేటి రోజుల్లో ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. సింఘ్వీ మరణం పట్ల నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, కొమురయ్య, రామస్వామి, పుల్లయ్య పాల్గొన్నారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హమాలీ కార్మిక వర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుతో కార్మికుల కుటుంబాలకు మేలు జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు ఆలోచించడం లేదని విమర్శించారు. హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. టీయూసీఐ జిల్లా నాయకులు పాడిన బీకు, నరసయ్య, వెంకన్న, వీరన్న, సంపత్, శేఖర్, నాగన్న, యాకయ్య, నరేష్, సైదులు, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పది మందికి గాయాలు

• వెంబడించి చంపిన గ్రామస్థులు

వెంకటాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపురం మండలకేంద్రంలోని అప్పాలవారి వీధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న పది మందిపై దాడి చేయడంతో వారు గాయపడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పాలవారి వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న వారిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరుస్తుండడంతో గమనించిన గ్రామస్థులు కర్రలతో దాడిచేసి చంపేశారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఏటూరునాగారం వైద్యశాలకు రెఫర్ చేశారు. కాగా, మండల కేంద్రంలోని ప్రతి వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి బారినుంచి కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

• ఇద్దరికి తీవ్ర గాయాలు



కాలు విరిగి తీవ్ర గాయాలపాలైన ప్రసాద్

ఏటూరునాగారం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోకు బ్రేకులు పడకపోవడంతో ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఏటూరునాగారం వైపు నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ములుగు వైపు నుంచి వాజేడు గ్రామానికి వెళ్తున్న ఆటో చిన్నబోయినపల్లి వేబ్రిడ్జి సమీప 163 జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఇసుక లారీని దాటించబోయాయి. ఈ క్రమంలో అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఆటో డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గ్రామానికి చెందిన పోడెం ప్రసాద్ అనే వ్యక్తికి కాలు విరిగింది. అంతేకాకుండా, వాజేడు గ్రామానికి చెందిన ఈక వెంకటలక్ష్మి అనే యువతికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వారిని ప్రయాణికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, కాలు విరిగి తీవ్ర గాయాలపాలైన ప్రసాద్‌కు వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి, పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కులగణన చేయాలన్న నిర్ణయం చరిత్రాత్మకం

పెద్దవంగర, మే 2 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన నిర్వహించడం దేశ ప్రజలందరూ హర్షించదగ్గ విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన ఆధారంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలకు చేకూరుతుందని అన్నారు. కేంద్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయానికి దేశ ప్రజలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ మాత్రం ఈ విజయం మాదే అంటూ గొప్పలు చెప్పుకునే సిగ్గుమాలిన పని చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహించే జనగణన, కులగణన పారదర్శకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తలారి సోమయ్య, సురేష్‌యాదవ్, శంకర్, వెంకన్న, భాస్కర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2211	1521
పల్లికాయ (సూక)	5800	5200
పల్లికాయ (పచ్చిది)	4350	3575
కందులు	6550	3022
పెసళ్లు	6722	3022
పత్తి	7550	5300
పసుపు (కాడి)	13502	10534
పసుపు (గోల)	12100	9700
తేజ మిర్చి	11700	9500
డిడి	-	-
వండర్‌హాట్	11200	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దీపిక	10500	10000
దేశీ	-	-
సింగిల్‌పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

ఎండ వేళ.. ఆరోగ్యం జాగ్రత్త



వరంగల్ మెడికల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో వడదెబ్బ నుంచి ప్రజలు వ్యక్తిగతంగా కాపాడుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి బెంబేలెత్తిపోతున్నారు. ఎండ వేడిమి నుంచి ఎవరికి వారు రక్షించుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రజారోగ్య విభాగం పలు నియమ నిబంధనలు ప్రజలకు సూచిస్తోంది.

సరిపడా ద్రవాలు

- దాహం వేసినా వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలి.
- విధిగా నీరు వెంట తీసుకెళ్లాలి.
- ఓఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ, పండ్లరసం వంటివి ఇంట్లో తయారు చేసిన పానీయాలను కొద్దిగా ఉప్పు కలిసి తాగాలి.
- పుచ్చకాయ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ లాంటి స్థానికంగా లభించే పండ్లు తినాలి.

విధిగా పాటించాల్సినవి..

- లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలు ధరించడం మంచిది.
- సూర్యరశ్మికి నేరుగా బహిర్గతమయ్యే సమయంలో గొడుగు, టోపి, టవల్ ఇతర సాంప్రదాయ తలపాగాను ఉపయోగించాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వెంటనే చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లి ద్రవ పదార్థాలు తాగాలి
- నీరు తాగడం ఉత్తమం
- వైద్య సహాయం పొందాలి - శరీర ఉష్ణోగ్రతను కొలవాలి
- తీవ్రమైన కండరాల నొప్పులు ఉన్నట్లయితే చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి
- ఎలక్ట్రోలైట్లను కలిగిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలి
- వేడి తిమ్మిరి గంట కంటే ఎక్కువగా ఉంటే వైద్య సంరక్షణ అవసరం.

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు బూట్లు, చెప్పులు విధిగా ధరించాలి వాతావరణ శాఖ వార్తలను ఎప్పటికప్పుడు పాటిస్తూ ఉండాలి

ఉష్ణోగ్రత పెరగడం వల్ల అనారోగ్యాలు

- వేడి దద్దుర్లు (చెమట పొక్కులు)
- వేడి ఎడిమ (చేతులు, పాదాలు, చీల మండలం వాపు)
- వేడి తిమ్మిరి (కండరాలు పట్టివేయడం)
- మూర్ఛపోవడం
- గుండె, శ్వాస, మూత్రపిండ సంబంధిత వ్యాధులను తీవ్రం చేస్తుంది.
- తలనొప్పి, వాంతులు, విరోచనాలు
- విపరీతమైన దాహం
- అసాధారణంగా ముదురు, పసుపు రంగు మూత్ర విసర్జన తక్కువగా ఉండటం.
- వేగవంతమైన శ్వాస, హృదయస్పందన

ఎండలో చేయకూడనివి..

- మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు రాకుండా ఉండాలి
- మధ్యాహ్నం బయట ఉన్నప్పుడు శారీరక కష్టంతో కూడిన కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

అప్రమత్తత అవసరం



వేసవిలో ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. రోజుకు ఐదు నుంచి ఆరు లీటర్ల నీటిని విధిగా తాగాలి. శరీరంలో నీటిశాతం తగ్గినప్పుడు నోరు తరాడడం తీవ్రమైన జ్వరం, వాంతులు కావడం తదితర లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స పొందాలి. 14 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు వడదెబ్బకు త్వరగా గురయ్యే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బకు గురైన వారిలో శరీరం ఎర్రగా మారుతుంది. వారి బట్టలు విప్పి చల్లని ప్రదేశానికి తరలించాలి. కండరాలు పట్టడంలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వడదెబ్బ నివారణకు అప్రమత్తతే ఆయుధం.

డాక్టర్ వైద్యం గౌతమ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్ విభాగం ఎంజీఎం ఆస్పత్రి

- వేడి ఎక్కువగా ఉండే సమయంలో వంట చేయడం మానుకోవాలి
- వంట ప్రదేశాన్ని తగినంత గాలి, వెలుతురు ఆడటానికి వీలుగా ఉండాలి
- అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని తినవద్దు
- నిల్వ ఆహారాన్ని తినరాదు
- పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను, జంతువులను వదిలి వెళ్లరాదు. వాహనాల్లో ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదంగా మారవచ్చు.

ఈ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి

- అయోమయం, ఆందోళన చికాకు అటాక్సియా మూర్ఛ, కోమా
- వేడి ఎరుపు, పొడి చర్మము
- 104 ఫారెన్ హీట్ కంటే అధిక ఉష్ణోగ్రత
- తలనొప్పి. ఆందోళన, మైకం
- పిల్లల్లో ఆకలి మందగించడం
- మూత్ర విసర్జన తగ్గడం.. ఏదైనా భాగం నుంచి రక్తస్రావం

డిగ్రీ విద్యార్థులకు 'పరీక్ష'



కేయూ క్యాంపస్, మే 2 (ఆంధ్రజ్యోతి): అడకత్తెరలో పోకచెక్కలా మారింది డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల పరిస్థితి. ఏళ్లుగా చదివిన చదువుకు ఆఖరు సెమిస్టర్ పరీక్ష నిజంగా పరీక్ష పెడుతోంది. కేయూ డిగ్రీ పరీక్షలెప్పుడూ అంటే.. ఇదిగో పులి అన్నట్లే మారింది. డిగ్రీ పూర్తయితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భావిస్తున్న యువతకు వర్సిటీ పరీక్ష వాయిదాల నిర్ణయం గొడ్డలి పెట్టుగా మారుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4 ఏళ్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకపోవడమే విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే విద్యార్థుల పరీక్షల ఫీజులను వర్సిటీకీ చెల్లించి పరీక్షలకు సహకరిస్తామని ప్రైవేట్ యాజమాన్యాలు తేల్చిచెబుతున్నాయి. మిగిలి ఉంటే ఉత్తీర్ణత సాధించేందుకు ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో రోజంతా కష్టపడి చదువుతుంటే వాయిదాల పర్వాన్ని కొనసాగించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా వుండగా, డిగ్రీ పరీక్షల వాయిదా వర్సిటీ అధికారులు, ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థులపైనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పరీక్షలపైనా ప్రభావం చూపనుంది. డిగ్రీ తర్వాత జరిగే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ పరీక్షల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పీజీ అడ్మిషన్ల కోసం చేపట్టే టీఎస్ పీజీసెట్-2025 లాసెట్, ఐసెట్, ఎడ్‌సెట్‌తో పాటు ఇతర ఉద్యోగ పరీక్షల షెడ్యూల్‌ను గందరగోళంలో పడేస్తోంది. రాష్ట్రంలోని ఏ వర్సిటీ పరీక్షలు వాయిదా పడినా ప్రవేశ పరీక్షలు నిర్వహించలేదని పరిస్థితి నెలకొంది.

- తరచూ వాయిదా పడుతున్న ఎగ్జామ్స్
- బకాయిలపై ప్రైవేటు కళాశాలల పట్టు
- చెల్లింపులో స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



అయితే ప్రభుత్వం ఇచ్చేదెప్పుడు? విద్యార్థులకు పరీక్షల నిర్వహించేది ఎప్పుడు? అనే ప్రశ్నలు విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ప్రైవేట్ యాజమాన్యాల వాదన

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యార్థుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం లేదని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులు పాసై టోకెన్‌లు పొందినప్పటికీ చెల్లింపులకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 6 నెలల కిందట జరిగిన పరీక్షల సమయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కె.కేశవరావులతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బకాయిలపై చర్చలు జరుపగా, వీలైనంత త్వరగా ఫీజుల బకాయిలు చెల్లిస్తామని, పరీక్షలకు సహకరించాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను కోరారు. దీంతో పరీక్షల నిర్వహణకు మొగ్గుచూపారు. ప్రభుత్వ పెద్దలు హామీలిచ్చి 6 నెలలు గడిచినప్పటికీ చిల్లీగవ్వ ప్రైవేట్ కళాశాలలకు చెల్లించలేదు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలు మళ్లీ ప్రభుత్వంపై బకాయిల చెల్లింపునకు ఒత్తిడి పెంచాయి. పరీక్షల సమయంలో భీష్మించుకుని కూర్చున్నాయి. దీంతో వర్సిటీల్లో పరీక్షల నిర్వహణ సందిగ్ధంలో పడ్డాయి.

డిగ్రీ విద్యార్థుల ఆందోళన

కేయూ పరిధిలో బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సులకు 1.70లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొదటి, రెండో, మూడో ఏడాదిలో సెమిస్టర్లలో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఏమైనా

ఇప్పుడిప్పుడే గాడిలోకి..

కరోనా విజృంభన తర్వాత ఇప్పుడిప్పుడే వర్సిటీలో తరగతులు, పరీక్షలు షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు గాడిలో పెడుతున్నారు. మళ్లీ ఇప్పుడు ఫీజుల బకాయిల తగాదాలతో విద్యార్థుల పరీక్షలు వాయిదా వేస్తుండంతో అకడమిక్ క్యాలెండర్ అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఏర్పడుతోంది. ఆఖరు సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బయటికి పంపితే వర్సిటీకి, విద్యార్థులకు భారం తగ్గుతోందని భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కూడా తగిన విధంగా స్పందించాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

పరీక్షలకు వర్సిటీ సిద్ధం

ప్రైవేట్ కళాశాలల ఫీజుల పంచాయితీ నడుస్తుండగా, కాకతీయ యూనివర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 22న మొదటి దఫా, ఏప్రిల్ 28న రెండో దఫా వర్సిటీ పరిధిలో పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌తోనూ పరీక్షల నిర్వహణపై చర్చలు జరిపారు. ఫీజులపై స్పష్టత రాగానే విద్యార్థుల పరీక్షల ఫీజులన్నీ చెల్లించి పరీక్షల నిర్వహణకు ముందుకు వస్తామని చెబుతున్నారు.

ఏడీఈ పదోన్నతులపై ఉద్యోగుల్లో అనిశ్చితి

రూల్ ఆఫ్ రిజర్వేషన్, కేడర్ స్ట్రెంత్‌పై అనుమానాలు

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏఈ, ఏఏఈ నుంచి ఏడీఈగా పదోన్నతుల కల్పించే విషయంలో ఉద్యోగులకు స్పష్టత లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నట్లుగా తెలుస్తోంది. ఏపీఎస్ఈబీ నిబంధనల ప్రకారం.. ఏఈ నుంచి ఏడీఈగా, ఏఏఈ నుంచి ఏడీఈగా, ఏఏఈ నుంచి ఏఈగా కన్వర్షన్ అయి ఏడీఈగా పదోన్నతి పొందిన ఉద్యోగులతో పాటు కంపెనీలో ఎంత మంది ఏడీఈలు ఉన్నారు..? పాత ఆర్ఓఆర్ ప్రకారం ఏడీఈ క్యాడర్‌లో ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్ వర్గాలకు చెందిన వారు ఎంత మంది ఉన్నారు..? ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేయడంతో కొత్త ఆర్ఓఆర్ ప్రకారం ఆయా వర్గాల నుంచి ఎంత మంది పదోన్నతి పొందబోతున్నారనే దానిపై అనేక అమామానాలు ఉన్నాయని ఆయా వర్గాలకు చెందిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 45 ఏళ్ల దాటిన వ్యక్తులకు డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత లేకున్నా ఏడీఈగా పదోన్నతి కల్పించేదని, కానీ ప్రస్తుతం వయస్సు సడలింపు రద్దు చేశారని, ఎవరైనా తప్పనిసరిగా డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సిందేనని, ఈ విషయంలో ఎంత మంది ఉత్తీర్ణత సాధించారు? సీనియారిటీ లిస్టు నుంచి ఎంతమంది తిరస్కరించబడ్డారు? అనే దానిపై సైతం అనేక సందేహాలు ఉన్నట్లుగా పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఏడీఈ పదోన్నతుల కోసం ఆయా సామాజిక వర్గాల్లోని ఎంతమంది ఉద్యోగుల నుంచి కంపెనీ ఏఆర్ఆర్ (అన్యూవల్ అప్రైసల్ రిపోర్ట్) తీసుకుందనే దానిపై పూర్తి స్పష్టత ఇవ్వాలని ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రశ్న. పదేళ్ల నుంచి ఏఈ నుంచి ఏడీఈ, ఏఏఈ నుంచి ఏడీఈ వరకు జరిగిన పదోన్నతులపై కంపెనీ సమీక్ష చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. వికలాంగ ఉద్యోగుల విషయంలో ఎలాంటి పట్టింపులేకుండా ఉందని, వారి గురించి మాట్లాడే వ్యక్తులే లేరని, ఇప్పటి వరకు వారి నుంచి ఏఆర్ఆర్ సైతం తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తోన్నాయి. వారి రిజర్వేషన్‌ను ఇతర వర్గాలకు ఏమైనా కన్వర్ట్ చేస్తున్నారనే దానిపై కూడా ఎన్పీడీసీఎల్‌లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా కేడర్ స్ట్రెంత్‌తో పాటు ఆర్ఓఆర్‌పై ఉద్యోగులకు ఉన్న అయోమయంపై కంపెనీ స్పష్టత ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పంటల బీమాపై మీనమేషాలు

(5వ పేజీ తరువాయి)



జరిగినప్పుడు ఆ పంటలకు పరిహారం వస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19.23 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా కాకతీయ కాలువ, దేవాదుల ప్రాజెక్టుతో పాటు చెరువులు, కుంటలు, బోరుబావుల ద్వారా అందే నీళ్లతోనే వివిధ పంటలు సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు ఎక్కువ సాగవుతాయి.

వడగళ్లు.. కడగళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏటా వడగళ్లు, వరదలు, ఈదురు గాలులు తదితర ప్రకృతి విపత్తులు సంభవించడం పరిపాటిగా మారిపోయింది. ఏప్రిల్, మే నెలలో రైతులు బిక్కుబిక్కు మంటున్నారు. ఎప్పుడు గాలివాన వస్తుందో.. వడగళ్లు కురిసి పంటలు ఎక్కడ తుడిచిపెట్టుకుపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా పలు చోట్ల వడగళ్లు కురిసి, అకాలవర్షాలు పడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి తోటలు అక్కరకు రాకుండా పోయాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటల బీమా అమలులో లేకపోవడంతో నష్టపరిహారం అందే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తానన్న ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందడం లేదు. రెండేళ్లుగా ఎవరికీ పరిహారం అందేలేదు. దీంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

యూనిఫైడ్ ప్యాకేజీ

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బీమా తక్షణ అమలుతో పాటు కేంద్ర ప్రభుత్వ యూనిఫైడ్ ప్యాకేజీ పథ కాన్ని ఉమ్మడి జిల్లాలో అమలు చేయాలలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. యూనిఫైడ్ ప్యాకేజీ వల్ల పంటల బీమా చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో రైతు కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం, అంగవైకల్యం పొందితే రూ.2 లక్షల పరిహారం, పాక్షికంగా వైకల్యానికి రూ.లక్ష పరిహారం ఇస్తారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు చదువుతున్న పిల్లలకు ఆర్థిక సాయం, ఇళ్లు నష్టపోయినా, ట్రాక్టర్ పంపుసెట్‌కు నష్టం వాటిల్లినా బీమా పరిహారాన్ని మంజూరిస్తారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం, యాసంగిల్లో సాగయ్యే పంటలకు సర్వే నెంబర్లు లేదా కమతం వారీగా పంటల బీమా అమలు చేయాలని కోరుతున్నారు.

అందాల భామలకు ఆతిథ్యం

- మిస్ వరల్డ్‌పై ప్రత్యేక శ్రద్ధ
- 14న రామప్పకు రాక
- రెండు గంటల పాటు రామప్పలో సందడి

వెంకటాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అందాల భామలకు అతిథ్యమిచ్చేందుకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ క్షేత్రం రామప్ప దేవాలయం సిద్ధమవుతోంది. ఈనెల 14న తెలంగాణలోనే అద్భుత పర్యాటక ప్రాంతమైన రామప్ప దేవాలయానికి 30 మంది ప్రపంచ సుందరీమణులు రానున్నారు. వారి రాక కోసం రామప్పలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పర్యటకశాఖ జిల్లా అధికారి శివాజీ, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ కుసుమ సూర్యకిరణ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో మే 7నుంచి 31 వరకు 72వ ఎడిషన్ మిస్‌వరల్డ్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీలకు 140 దేశాల నుంచి మూడువేల మంది అందాలభామలు విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు.





రామప్పలో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో చురుగ్గా సాగుతున్న పనులు



ఇటీవల రామప్పను సందర్శించిన మిస్ ఇండియా నందిని గుప్తా (ఫైల్)

మిస్ వరల్డ్‌పై ప్రత్యేక శ్రద్ధ

మిస్ వరల్డ్-2025' పోటీల్లో భాగంగా 14న రామప్పకు రానున్న సుందరీమణుల కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ నేపథ్యంలో అందరిచూపు రామప్పపై పడనుంది. రామప్ప ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిద్దిదడంపై ప్రస్తుతం దృష్టి సారించారు. హైదరాబాద్ పోటీల్లో పాల్గొనే వారిలో 30 మంది సుందరీమణులు రామప్పను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రామప్పలో పలు ప్రత్యేక ప్రాంతాల్లో లైటింగ్, ఎఫెక్టులు, ఆధునాతన హంగులను రూపొందించనున్నారు. అంతర్జాతీయ ప్రముఖులు ఔరా అనేలా రమణీయంగా తీర్చిదిద్దనున్నారు. అందంగా సుందరంగా కళ్లు మిరుమిట్లు గొలిపే థీమ్స్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

రామప్పను సందర్శించిన మిస్ ఇండియా

ఇటీవల రామప్ప దేవాలయాన్ని 2023 మిస్ ఇండియా నందినిగుప్తా సందర్శించారు. రామప్ప శిల్పం, ప్రశాంతమైన పరిసరాలు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కోసం రామప్ప క్షేత్రాన్ని తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రదేశమని ఆమె తెలిపారు. మే 14న రామప్పకు క్షేత్ర సందర్శనకు వచ్చే అందెగత్తెలు కూడా ఆధ్యాత్మిక అనుభూతి పొందనున్నారు.

14న జరిగే కార్యక్రమాలు ఇవే..

ఈనెల 14న హైదరాబాద్ నుంచి రామప్పకు బయలుదేరనున్నారు. వస్తున్న క్రమంలో వివేర హోటల్‌లో మధ్యాహ్నం భోజనం చేసి నేరుగా రామప్పకు సాయంత్రం 4గంటల వరకు చేరుకుంటారు. ముందుగా రామప్ప సరస్సు సమీపంలో ఉన్న హరిత హోటల్‌కు చేరుకోని ప్రపంచంలోనే బెస్ట్ టూరిజం గ్రామమైన పోచంపల్లికి చెందిన తెలుగు సంప్రదాయ చీరెలు కట్టుకోని రామప్పకు చేరుకోని ఆలయ సమీపంలో ఉన్న చిరు వ్యాపారుల వద్ద బొమ్మలు కొనుగోలు చేస్తారు. అక్కడ నుంచి రామప్ప ప్రధాన గేటు నుంచి ఆలయ లోపల వరకు ఆదివాసీ కొమ్ము నృత్యంతో వారికి ఆలయ సమీపంలో రాతి గోడ వరకు తీసుకెళుతారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో ప్లేట్లలో కాళ్లు కడుక్కుంటారు. రాతి గోడ నుంచి వారికి రెడ్ కార్పెట్ ద్వారా తూర్పుముఖ ద్వారం నుంచి ఆలయంలోకి చేరుకుంటారు. అక్కడ రెండు బృందాలుగా వారిని విభజించి 15 మందికి ముందుగా దర్శనం, మరో 15 మందికి ప్రొఫెసర్ పాండురంగరావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ కుసుమ సూర్యకిరణ్‌లు రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి నీటిలో తెలియాడే ఇటుకలు, దేవాయాలన్నీ స్యాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మించారని వారికి వివరిస్తారు. అనంతరం గ్రూప్ ఫొటో చిత్రీకరణ ఉంటుంది. అనంతరం ఆలయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకోని పేరిణి నృత్య కళాకారుడు గజ్జెల రంజిత్ కళా బృందం ప్రదర్శించే పేరిణీ నృత్య ప్రదర్శనతో పాటు, సంగీత నాట్య అకాడమీ ఛైర్మన్ అలేఖ్య డాన్స్ బృందంచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తారు. అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్ చేతుల మీదుగా సుందరీ మణులకు సన్మానం కార్యక్రమం ఉంటుంది. సభాస్థలి నుంచి నేరుగా తూర్పుముఖ ద్వారం సమీపంలో రూ.62కోట్లతో చేపడుతున్న ప్రసాద్ స్కీమ్ ప్రాజెక్టును సందర్శించి అక్కడే భోజనం చేసి తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ధాన్యం రైతులకు దగా.!

- పైసలిస్తేనే వడ్ల కాంటాలు
- కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశికి నిప్పంటించేందుకు యత్నించిన రైతు
- అడ్డుకున్న తోటి అన్నదాతలు
- నర్సింహులపేటలో ఘటన



నర్సింహులపేటలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశిపై పెట్రోలు చల్లుతున్న రైతు అంకం రామకృష్ణ

నర్సింహులపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రైతులు దగా పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ ప్రకారం కాకుండా.. పైసలిచ్చిన (లంచాలు) ఇచ్చిన రైతుల ధాన్యమే కాంటాలు పెట్టడం ఏమిటని ఆగ్రహించిన ఓ రైతు తన వడ్ల రాశికి పెట్రోలు పోసి నిప్పంటించేందుకు యత్నించిన ఘటన నర్సింహులపేట మండలకేంద్రంలో శుక్రవారం జరిగింది. నర్సింహులపేట మండల కేంద్రంలో రబీ సీజన్ (యాసంగి)కి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి మండల వ్యవసాయ అధికారులు ఇచ్చిన సీరియల్ కూపన్ ప్రకారం కాంటాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నర్సింహులపేటకు చెందిన అంకం రామకృష్ణ తన ఎకరం పొలంలో వచ్చిన వడ్లు ఏప్రిల్ 10న కొనుగోలు కేంద్రంలో సుమారు 50 టిక్కీల ధాన్యాన్ని రాశీగా పోశారు. ధాన్యం పూర్తిస్థాయిలో ఎండినట్లు తెలిపారు. వారం రోజుల నుంచి కొనుగోలు కేంద్రం నిర్వహకులు, వ్యవసాయ అధికారులు తిరుగుతున్నప్పటికీ ధాన్యం మాయిశ్చర్ చూడకుండా పట్టించుకోవడంలేదని, సీరియల్ ప్రకారం కాకుండా నిర్వాహకులకు పైసలు(లంచాలు) ఇచ్చిన రైతుల ధాన్యం మాత్రమే కాంటాలు పెడుతున్నారంటూ ఆగ్రహించాడు. ధాన్యం రాశికి పెట్రోలు పోసి నిప్పంటించేందుకు యత్నించడంతో స్థానికంగా ఉన్న తోటి రైతులు అడ్డుకొని, శాంతింపచేశారు. వ్యవసాయ అధికారులు ఇచ్చే సీరియల్ ప్రకారం కాంటాలు పెట్టడంలేదని, లంచాలు, మామూళ్లు ఇచ్చిన రైతులకే ప్రాధాన్యం ఇస్తూ.. వారి ధాన్యం మాత్రమే కాంటాలు పెట్టడం ఏమిటని కొందరు రైతులు బహిరంగంగానే ఆరోపిస్తుండడం విశేషం. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రంలో అక్రమ వసూళ్లు నివారించి, సకాలంలో ధాన్యం కాంటాలు నిర్వహించాలని రైతు సంఘాల నాయకులు డిమండ్ చేశారు.



న్యూఢిల్లీ కాంగ్రెస్ ఓబీసీ సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

బీసీ కులగణనకు ఆదర్శం

మహబూబాబాద్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త కులగణనకు తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్‌గా నిలువనుందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న అన్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ఓబీసీ సెల్ జాతీయ కార్యవర్గ సమావేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బీసీ కులగణనపై సమగ్రంగా వివరించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మహబూబాబాద్ టౌన్, మే2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లెబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌తో ఈనెల 20న జరుపతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్లజగన్నాథం భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో కోత విధించి సామాన్యులపై భారం మోపుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గునిగంటి రాజన్న, దుడ్డెల రాంమూర్తి, కుమ్మరికుంట్ల నాగన్న, చీపిరి యాకయ్య, గౌని వెంకన్న, వరిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్‌లో కార్మిక సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూల ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌కు దేశవ్యాప్త సమ్మె నోటీసును అందజేశారు. కార్మికుల తమ హక్కుల సాధన కోసం ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, రేషపల్లి నవీన్, పర్వత కోటేష్, బాలు, లచ్చ, విజయ్, నవీన్, మహేందర్, చెక్కల సోమయ్య, రమేష్, రవి, మోహన్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుధాకర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

క్రీడల్లో ఆసక్తిని పెంపొందించేందుకే శిబిరాలు

- జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణస్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడతాయని జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్వో) జ్యోతి అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖోఖో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయటం వలన విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలు పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతీరోజు శిక్షణ శిబిరానికి వచ్చి వ్యాయామ ఉపాధ్యాయులు నేర్పించే ఆటలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మారథాన్ క్రీడాకారుడు ఎం.లింగారెడ్డి, జాతీయ క్రీడాకారులు ఇస్మాయిల్, శ్రీధర్‌రెడ్డి, వెంకన్న, అంజయ్య, సోమనర్సయ్య, రహిమాన్, వినయ్, శేఖర్, కృష్ణలను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకన్న, వేణు, మేఘన, దిలీప్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



డీవైఎస్వో జ్యోతి, మాజీ జాతీయ క్రీడాకారులను సన్మానిస్తున్న గ్రామస్థులు

రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే దేశవ్యాప్త కులగణన

మహబూబాబాద్ టౌన్, మే2 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోరాట ఫలితంగానే కేంద్రప్రభుత్వం దిగివచ్చి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయించిందని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ కులగణన చేస్తామని ప్రకటించారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణను పూర్తి చేశారని చెప్పారు. కులగణనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలు సామాజికంగా, రాజకీయంగా, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్ పొందే అవకాశం ఉందని చెప్పారు. కేంద్రం మాటకు కట్టుబడి కులగణన చేసి దేశ వ్యాప్తంగ బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పింగ్రాల రాందాసు, మాందాటి శ్రీనివాస్, బండారు చిరంజీవి, బట్టు దేవ్‌సింగ్, అనంతుల రాజమ్మ, సరస్వతి, సప్పిడి రంజిత్, మహమూద్, రాంజీ, పరుశురాం, పిల్లి కృష్ణ, పద్మ పాల్గొన్నారు.

● గార్ల, (ఆంధ్రజ్యోతి) : రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన జోడోయాత్రలో దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ మేరకు మోదీ ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం చేయడాన్ని స్వాగతిస్తూ రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు మాట్లాడుతూ బావితరాల భవిష్యత్ కోసం రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేసే విధంగా ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ బలపర్చాలని కోరారు. బలహీన వర్గాలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ అంపకాశాలు రావాలంటే దేశ వ్యా ప్తంగా కులగణన జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా నర్సయ్య, బాపనపల్లి సుందర్, గోసు నగేష్, గంగారాణి, గుగులోత్ శ్రీనివాస్, గోపే వెంకటేశ్వర్లు హరి నాయక్ పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చెరువులో శవమైన బాలుడు

- ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు



జాన్‌పాల్(ఫైల్)

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఆరేళ్ల బాలుడు జాన్‌పాల్ భూపతిపేట శివారులోని చెరువులో శవమై తేలాడు. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. చిన్నఎల్లాపురం గ్రామశివారు లక్ష్మణ్‌తండాకు చెందిన వాంకుడోతు కృష్ణమూర్తి-సునీతల రెండో కుమారుడు జాన్‌పాల్ (6) అదృశ్యమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై బాలుడి తండ్రి గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే.. గత రెండ్రోజుల క్రితం లక్ష్మణ్‌తండా నుంచి వాంకుడోతు కృష్ణ మూర్తి-సునీత దంపతులు ఇద్దరు కుమారులతో సహా సీతానగరం శివారు ఆదివారంపేటలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. రాత్రి సమయం కావడంతో కృష్ణమూర్తి తన కుమారుడు జాన్‌పాల్‌తో ఆటోలో వస్తుండగా రెడ్డిపల్లి కల్వర్టు వద్ద ఆటోఆపి తండ్రితోపాటు నిద్రకు ఉపక్రమించారు. రాత్రి సమయంలో కృష్ణమూర్తి లేచి చూసేసరికి కుమారుడు కన్పించకపోవడంతో ఆందోళనకు గురై చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మర్నాడు ఉదయం శుక్రవారం భూపతిపేట చెరువులో జాన్‌పాల్ విగతజీవిగా కన్పించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, పోలీసులు సందర్శించారు. జాన్‌పాల్ మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం నర్సంపేటకు తరలించి అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసును అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

దేవాలయంలో తిరునక్షత్ర పూజ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీత్రిదండి రామానుజాచార్యుల తిరునక్షత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక దేవాలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు రమణయ్య వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చాపల ఉషా బాపురెడ్డి, పులి యాదమ్మ, పరకాల పద్మ, మల్లం సువర్ణ, సింగం చంద్రకళ, కైరంకొండ లలిత, మొగిలి ప్రసాద్‌రెడ్డి, కొల్లూరి రవికుమార్, సింగం మనోహర్, పరకాల ఉపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బవిరిశెట్టి శ్రీనివాస్, మేక ప్రవీణ్‌రెడ్డి, జూలకంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టబోతున్న ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ బీజేపీ నాయకులు కొత్తగూడలో శుక్రవారం మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కులగణనతో అణగారిన వర్గాలకు మేలు చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు తోటకూరి మధు, బోనాల ప్రవీణ్, నాయకులు బోడ నవీన్ నాయక్, వాసం సారయ్య, మామిడి యాకయ్య, గంగారపు బిక్షపతి, హరిలాల్, సిరబోయిన యాకయ్య, అనిల్, వజ్జ రవి పాల్గొన్నారు.

ఈదురుగాలులకు విరిగిన 279 విద్యుత్ స్తంభాలు

- 90 గ్రామాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, మే2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాలవర్షం, ఈదురుగాలులతో 279 విద్యుత్ స్తంభాలు విరిపోవడంతో పాటు 33-11 కేవీ వైర్లు తెగిపోవడంతో సుమారు 90 గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి జె.నరేష్ తెలిపారు. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లాలో అనంతారం, గాంధీపురం, జమాండ్లపల్లి, గడ్డిగూడెం, రెడ్యాల, గుండ్రాతిమడుగు, బయ్యారం, జగ్గుతండ, సంధ్యతండా, గార్ల, గొల్లచెర్ల తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ లైన్లమీద పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలకు తొలగించి యుద్ధ ప్రాతిపాదికన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులకు కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పలుసూచనలు చేసినట్లు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరించడంలో డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్, డీఈలు విజయ్, పెద్దిరాజం, సునితాదేవి, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్సూర్ బాబా కందురుల ఉత్సవం

డోర్నకల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలంలోని లచ్యతండా వద్ద శుక్రవారం మల్సూర్‌బాబా దర్గా కందురుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి డోర్నకల్, కామేపల్లి, కురవి, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మల్సూర్‌బాబా, ఫుల్ బాబోజీ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా డోర్నకల్ పోలీసులు దర్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ బందోబస్తు ఏర్పాటు చేశారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు మాన్‌సింగ్‌బాబజీ, లచ్చు బాబాజీ, లచ్చిరాంనాయక్, రంజిత్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



కురవిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- రైతు సంఘం నాయకులు

కురవి, మే 2 (ఆంధ్రజ్యోతి) : అకాల గాలివానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి మండలంలోని రాజోలు, కురవి, బలపాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మామిడి తోటలను శుక్రవారం వారు పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేడి కోటయ్య, కట్ల కృష్ణ, బానోత్ సిరి, జగన్, రాంబాబు, దూప్‌సింగ్, సీతారాంనాయక్ పాల్గొన్నారు.

- ప్రభుత్వం కర్షకులను ఆదుకోవాలి..

అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని ఆత్మ మరిపెడ డివిజన్ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కురవిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గాలివాన బీభత్సంతో అనేక మంది ఇండ్ల పైకప్పులు లేచిపోయాయని, మిర్చి, మామిడి, జామ తోటలు దెబ్బతిన్నాయని, రైతాంగానికి ఇబ్బంది కలిగించకుండా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నం రాజన్న, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, ఎన్.గురువయ్య, శరత్, నెల్లూరి నాగేశ్వర్‌రావు, పిట్టల వెంకన్న, బత్తుల వెంకన్న, నామ సైదులు పాల్గొన్నారు.

గాలిదుమారం బీభత్సం

(5వ పేజీ తరువాయి)

అంతరాయం ఏర్పడింది. పోలీసులు గ్రామస్థుల సహకారంతో ఆ చెట్లను తొలగించారు. అనేక విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఐకేపీ కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోయింది. డోర్నకల్ మండలంలో బంజర, చిల్కోడు, వెన్నారం, గొల్లచర్ల గ్రామాల్లో బొప్పాయి, మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. బూరుగుపాడులో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల రోడ్లమీద చెట్లు కూలిపోవడంతో స్థానికులు తొలగించారు. సీరోలు మండలం కాంపెల్లిలోని వీరన్న ఇంటి పైకప్పు లేచిపోయింది. ఆ ఇంట్లో ఉన్న పెద్దలతో పాటు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ ఆందోళనకు గురయ్యారు. మహబూబాబాద్-ఖమ్మం రహదారిలో కాంపెల్లి వద్ద భారీవృక్షాలు నేలకూలడంతో స్థానికులు తొలగించారు. గార్ల పరిధిలో గార్ల-డోర్నకల్ మధ్య, సత్యనారాయణపురం-గార్ల మధ్య అనేక చెట్లు నేలకూలాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి డోజర్‌లను తెప్పించి చెట్లను తొలగించారు. మామిడితోటలో కాయలు రాలిపోయాయి. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు.

కొట్టుకుపోయిన ధాన్యం

గూడూరు మండలంలో కురిసిన వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొంతమేర కొట్టుకుపోయింది. ఉదయం నీళ్లలో కొట్టుకుపోయిన ధాన్యం చూసి రైతులు రోదించారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే కాకుండా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కూడా కొట్టుకుపోయి తడిసిపోయింది. వరి నేలవాలింది. కేసముద్రం మండలం కాట్రపల్లిలో భవానిగడ్డ, శివశంకర్‌నగర్‌లో జల్లె మమత, సరోజన, డి.అనిత, భవాని, కేసముద్రంలోని చైతన్యనగర్ కాలనీల్లో నల్ల స్వప్నకు చెందిన ఇంటి పైకప్పులు లేచిపోయి ఇంట్లో సామగ్రి తడిసిపోయింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. మరిపెడ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతులు టార్పాలిన్‌లు కప్పికాపాడుకోవడానికి ప్రయత్నించినప్పటికి వరదనీటిలో ధాన్యం కొట్టుకుపోగా, ఉన్న కొంతభాగం తడిసిముద్దయింది. కాంటాలు పెట్టి రవాణాకు సిద్ధంగా ఉన్న బస్తాలు సైతం తడిసిపోయాయి. వీరారంలో గత 20 రోజుల క్రితం తీసుకువచ్చిన ధాన్యం మయిశ్చర్‌లేదని, బస్తాలు లేవన్న వంకతో కొనుగోలు చేపట్టకపోవడంతో ఆ ధాన్యం తడిసిపోయి నష్టపోయామంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

తొర్రూరు మండలం ఫత్తేపురంలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి. మహబూబాబాద్ మండలంలోని మహబూబాబాద్- పెనుగొండ వరకు మహబూబాబాద్ నుంచి అనంతారం రోడ్డులో అనేక చెట్లు రోడ్లపై కూలిపోయాయి. పోలీసులు జేసీబీలతో ఆ చెట్లను తొలగించారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చెట్టు కూలడంతో అధికారులు దానిని తొలగించారు. కంబాలపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. బ్రహ్మణపల్లి లక్ష్మీపురంలో రాంధన్ అనే రైతు ఇంటి పైకప్పు లేచిపోవడంతో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. కాగా, చిన్నగూడూరు, ఇనుగుర్తి, దంతాలపల్లి, కొత్తగూడ, నర్సింహులపేట, నెల్లికుదురు, పెద్దవంగర మండలాల్లో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

క్రైం కార్నర్

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి

డోర్నకల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు కలుపు నివారణ మందు (గడ్డిమందు) తాగి ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం ముల్కలపల్లిలో చోటు చేసుకుంది. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. ముల్కలపల్లికి చెందిన షేక్.రషీద్ (24) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం తన వ్యవసాయ చేను వద్దకు వెళ్లిన ఆయన అక్కడ గడ్డిమందు తాగి, ఆపై తన సోదరుడికి ఫోన్‌చేసి తనకు జీవితంపై విరక్తి చెందడంతో గడ్డిమందు తాగినట్లు చెప్పాడు. దీంతో అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రషీద్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు రషీద్ తండ్రి షేక్.చిన్న సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్, మే2 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్-కారేపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య ఉన్న పుల్లూరు వద్ద అధికారులు కొంత కాలం క్రితం ఇసుకను నిల్వ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ఆ ఇసుక అవసరం ఉంటుందని, అక్కడ ఏర్పాటు చేసిన డంప్ నుంచి ఇసుక మాయమవుతున్న విషయాన్ని గమనించిన రైల్వే అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ ట్రాక్టర్ అక్కడ్నుంచి ఇసుక తరలిస్తుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది ట్రాక్టర్‌ను పట్టుకుని డోర్నకల్ ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం విచారణ జరుపుతున్నట్లు రైల్వే ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు.

న్యూస్ బాక్స్



తట్టుపల్లిలో గ్రామపంచాయతీ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న గిరి

'ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి'

కురవి, మే2 (ఆంధ్రజ్యోతి) : తట్టుపల్లిలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీవై గిరి ఆరోపించారు. ఈ మేరకు తట్టుపల్లి గ్రామ పంచాయతీ ఎదుట లబ్ధిదారులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీ ఏకపక్షంగా అనర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసిందని విమర్శించారు. అర్హులకు అన్యాయం జరిగినప్పటికి స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం శోచనీయమన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు పార్టీలకు అతీతంగా పోరాడుతామన్నారు. ఆయా పార్టీల నాయకులు బుడిగె బద్రిగౌడ్, ప్రభాకర్, సురేష్, పోతుగంటి వెంకన్న పాల్గొన్నారు.

'సమగ్ర విచారణ జరిపించాలి'

నెహ్రూసెంటర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కలకలం రేపుతున్న భూదాన్ భూములపై సమగ్ర విచారణ జరిపించి, కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంలో భూదాన్ భూములు కబ్జాచేసి ఎన్‌వోసీ పొంది తప్పుడు డాక్యూమెంట్‌లు సృష్టించి లబ్ధిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే మాదిరిగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 75 ఎకరాల భూదాన్ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బానోత రాందాస్, మంగీలాల్, శ్రీను, బాలు, వీరన్న, సిద్ధార్థ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూనికల అధికారి తనిఖీ



ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాన్ని తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల అధికారి విజయ్‌కుమార్

కేసముద్రం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పౌర సరఫరాల శాఖకు చెందిన మండల్ లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్‌ను శుక్రవారం జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారి ఎస్.విజయ్‌కుమార్ తనిఖీలు చేశారు. గోదాంలో ఉన్న ఐదు టన్నుల ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాన్ని పరిశీలించారు. బ్యాలెన్స్‌లేని బరువులను ఉపయోగించడంవల్ల యంత్రంలో కొంత సమస్య వచ్చిందని, దాన్ని సరిచేయించినట్లు ఆయన తెలిపారు. తూకాల్లోఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ఆయన వెంట రేషన్ డీలర్లు ఉన్నారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

కొత్తగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బత్తులపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

తొర్రూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.70కోట్ల నిధులు మంజూరు చేసిందని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రూ.3.50లక్షలతో పెద్ద చెరువుపై మినీ ట్యాంక్ బండ్ పనులు ప్రారంభించడం హాస్యాస్పదమని అన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ఆడిటోరియం, డ్రైనేజీలు, డివైడర్, వంద పడకల ఆస్పత్రి, హరిపిరాల, కంటాయపాలెం రోడ్లు, ఇతర పనులకు నిధులు మంజూరు చేయించారని, ఆ పనులు పూర్తి చేయకుండా తిరిగి ప్రారంభించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు, ఉప్పలయ్య, కుమార స్వామి, రవి, ఆర్. వెంకన్న, జంపా, శంకర్, బాస్కర్ తదితరులు ఉన్నారు.